

ట్రాన్స్‌పోర్టు అథారిటీ మెంబర్‌గా శ్రీనివాస్



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు

లక్షెట్టిపేట, జనవరి.17 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా ట్రాన్స్‌పోర్టు అథారిటీ మెంబర్‌గా వెంకట్రావుపేట గ్రామానికి చెందిన అంకతి శ్రీనివాస్‌ను నియమించారు. శుక్రవారం ఆయనకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు దంపతులు మంచిర్యాలలోని నివాసంలో శ్రీనివాస్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. అంకతి శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన ఎమ్మెల్యేకు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు, ప్రజాప్రతినిధులు స్నేహితులు శ్రీనివాస్‌ను అభినందించారు.

20న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా

శ్రీరాంపూర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 20న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా (పీఎన్‌ఏఎం) నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ టి.సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. 2024 నాటికి ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, వెల్డర్, టర్నర్, మెషినిస్ట్, కోపా ట్రేడ్స్ పూర్తి చేసిన అభ్యర్థులు మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి గలవారు www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకొని, ఎస్‌ఎస్‌సీ, ఐటీఐ మెమో, కుల ధ్రువీకరణ, జిరాక్స్‌లతో పాటు బయోడేటా తీసుకొని రావాలని కోరారు.

మూడేళ్లుగా ఎదురుచూపులు





"ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు మూడేళ్లుగా విడుదల కావడం లేదు. వీటిపై ఆధారపడ్డ విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నాయి. విద్యార్థులను వార్షికపరీక్షల రుసుం చెల్లించాలని, పూర్తయిన వారికి ఒరిజనల్ సర్టిఫికెట్లు ఇవ్వడానికి యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయి. నిధులు విడుదల చేయాలని పలుమార్లు విద్యార్థులు నిరసన కార్యక్ర మాలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో విద్యార్థులు ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధపడుతున్నారు."

- విడుదల కాని ఫీజు రీయింబర్స్‌మెంట్
- బకాయిలతో కళాశాలల నిర్వాహకుల ఆందోళన
- జిల్లాలో కోట్లాది రూపాయలు పెండింగ్
- విద్యార్థులపై పెరుగుతున్న ఒత్తిళ్లు
- 30న బీసీ విద్యార్థుల సమర శంఖారావం

మంచిర్యాల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందజేసే ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులకు ఉచిత విద్యాబోధన చేస్తున్నాయి. ఇందుకు గాను బోధనకు అయ్యే ఖర్చులన్నీ యాజమాన్యాలు అప్పోసప్పో చేసి భరిస్తున్నాయి. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తే చేసిన అప్పులతోపాటు తమ ఖర్చులకూ ఇబ్బందులు ఉండవని భావిస్తూ సంవత్సరాల తరబడి వేచి చూస్తున్నాయి. మూడేళ్ళుగా ప్రభుత్వాలు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయకపోవడం, కళాశాలల నిర్వహణ తలకు మించిన భారం కావడంతో యాజమాన్యాలు ఆందోళన చెందుతుండగా, విద్యార్థులపైనా ఒత్తిడి పెరుగుతోంది. బోధనా రుసుం, ఉపకార వేతనాల బకాయిలు పేరుకుపోవడంతో కొన్ని కళాశాలలు మూతపడడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మూడేళ్లుగా ప్రభుత్వాలు నిధులు విడుదల చేయడం లేదు. దీంతో అధ్యాపకుల వేతనాలు చెల్లించి, కళాశాలలు నడిపించడం కష్టంగా మారిందని ప్రైవేట్ యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పేరుకుపోయిన బకాయిల్లో సగం నిధులు విడుదలైనట్లు ప్రభుత్వం పేర్కొని ఏడాది కావస్తున్నా విద్యార్థుల ఖాతాల్లో నగదు జమ కాలేదు. దీంతో విద్యార్థులు, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురుతున్నారు.

రూ. 45 కోట్ల మేర బకాయిలు....

జిల్లాలో 2020-21 నుంచి 2023-24 వరకు మూడు సంవత్సరాల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ విద్యార్థులు 20వేల వరకు ఉండగా, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు కలిపి రూ.40 కోట్ల నుంచి రూ. 45కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయి.

● బీసీ సంక్షేమశాఖలో ఎంటీఎఫ్(స్టూడెంట్ మెయింటనెన్స్)రూ.3.50కోట్ల బకాయిలు ఉండగా, ఆర్టీఎఫ్(ఫీజు రీయింబర్స్‌మెంట్) రూ.20.50 కోట్లు పెండింగులో ఉన్నాయి. ఈ బకాయిలు ఇలా ఉండగానే కొత్తగా చేరుతున్న విద్యార్థులు మళ్లీ దరఖాస్తు చేసుకుం టున్నారు. ఈబీసీ డిపార్టుమెంట్ ఆర్టీఎఫ్ రూ.2.50 కోట్లు బకాయిలు ఉండగా, మైనారిటీ కేటగిరీ కింద ఎంటీఎఫ్ రూ.1.30కోట్లు, ఆర్టీఎఫ్ రూ.3.90 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఎస్సీ సంక్షేమశాఖలో ఎంటీఎఫ్ రూ.2.20కోట్లు ఉండగా, ఆర్టీఎఫ్ రూ.3.70కోట్ల బకాయిలు ఉన్నాయి. ఎస్టీ సంక్షేమశాఖ ద్వారా రూ.5.85 కోట్ల బకాయిలు ఉన్నాయి. మొత్తం బకాయిల్లో దాదాపు రూ. 15కోట్లకు ప్రొసీడింగ్స్‌తోపాటు 10నెలల క్రితం టోకెన్ నెంబర్లు ఇచ్చినప్పటికీ ట్రెజరీల్లో పెండింగులో ఉన్నట్లు చూపిస్తోంది. విద్యార్థుల ఖాతాల్లో జమ కాకపోవడంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారైంది. మిగతా రూ.20నుంచి 25కోట్లు ఇంతవరకు బడ్జెట్ కేటాయించలేదు.

విద్యార్థుల ఇబ్బందులు..

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వాలు సకాలంలో విడుదల చేయని కారణంగా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయి. బోధనా ఫీజులు చెల్లిస్తేనే వార్షిక

మిగతా 7లో



కాగజ్‌నగర్‌లోని డయాలిసిస్ కేంద్రం

డయాలిసిస్ కేంద్రంతో.. తీరిన కష్టాలు

- పెరుగుతున్న పెషెంట్లు
- మరో రెండు మిషన్లు వస్తే మరింత ఉపయోగం

6

పవిత్ర గంగాజలాన్ని సేకరించిన మెస్రం వంశీయులు

- 28న నాగోబా జాతర
- గంగాజలంతో మహాదేవుడికి అభిషేకం

7



గంగాజలాన్ని సేకరిస్తున్న మెస్రం వంశీయులు

అభివృద్ధిలో ఉమ్మడి జిల్లాను అగ్రభాగాన నిలపాలి



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పాల్గొన్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధిలో అగ్రభాగాన నిలపాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శుక్రవారం నిర్మల్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ప్రభుత్వం చేపడుతున్న పథకాల అమలులో లబ్ధిదారుల ఎంపికపై కలెక్టర్‌లు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ఫలాలు అర్హులకు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ నెల 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అర్హులైన వారికి ఫలాలు అందేలా అధికారులు పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు, రైతు భరోసా అందించాలని తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రైతుభరోసా పథకంలో భాగంగా జిల్లాలోని రెవెన్యూ గ్రామాల డాటాను అధికారులకు అందించామన్నారు. 55 మంది విస్తరణ అధికారులతో ఈనెల 16 నుంచి సర్వే నిర్వహిస్తున్నామన్నారు. 1,64,141 మంది రైతులకు సంబంధించి 3,50,213 ఎకరాల భూమికి కార్యాచరణ రూపొందించామన్నారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరిస్తున్నామన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌మోతిలాల్, అధికారులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు



ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

చెన్నూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ అన్నారు. శుక్రవారం సామాజిక ఆరోగ్య కేంద్రంను తనిఖీ చేసి ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చేరోగులకు సరైన సౌకర్యాలతోపాటు వైద్యం అందించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది స్థానికంగా ఉండకపోవడం, సమయపాలన పాటించకపోవడం, విధులు సక్రమంగా నిర్వర్తించకపోవడంపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెలవుల్లో వెళ్లేవారు ముందే మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. వేమనపల్లి, కోటపల్లి, అంగ్రాజ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలోని గర్భిణీలను ప్రసవాల కోసం చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని కోరారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ, జగదీష్, వెంకటసాయి తదితరులు ఉన్నారు.

హెచ్‌ఐవీ సెంటినెల్ సర్వేలెన్స్ ప్లస్ ఏర్పాటు

గర్మిళ్ల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సహకారంతో దిశ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్‌ఐవీ సెంటినెల్ సర్వేలెన్స్ ప్లస్ సెంటర్ ఏర్పాటు చేశామని డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్ శుక్రవారం తెలిపారు. మూడు నెలలు గర్భిణుల శాంపిల్స్ తీసుకొంటామని, హెచ్‌ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్ బీఅండ్‌సీ గురించి సమాచారం సేకరిస్తామన్నారు. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో 400 శాంపిల్స్ లక్ష్యం కాగా ఈ నెల 11 నుంచి శాంపిల్స్ సేకరిస్తున్నామని, ఇప్పటి వరకు 28 సేకరించామన్నారు. నోడల్ పర్సన్ డాక్టర్ గరుడలక్ష్మీ, డాక్టర్ సుధాకర్‌నాయక్ పాల్గొన్నారు.

జాయింట్ సర్వే నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జన్నారం మండలం చింతగూడ గ్రామపంచాయతీలోని పాపమ్మగూడలోని సర్వే నెంబరు 81/1లోని 20 ఎకరాల ప్రభు త్వ భూమిలో ఫారెస్టు, రెవెన్యూ జాయింట్ సర్వే నిర్వహించాలని శుక్రవారం సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ మంచిర్యాల ఆర్డీవోకు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ జాయింట్ సర్వే నిర్వహించి ఇండ్లు లేని పేదలకు ప్రభుత్వం ఇండ్ల స్థలాలను కేటాయించాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగం గా ఇదే సర్వే నెంబరులో ఇండ్లు లేని వారికి స్థలాలు కేటాయించి ఇండ్లు కట్టించి ఇవ్వాలన్నారు. బాపు, సాజిద్, సికిందర్, మల్లేష్, రజిత, పోసవ్వ, నాగలక్ష్మీ పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీసు వెల్ఫేర్ సొసైటీ క్యాలెండర్ ఆవిష్కరణ

మంచిర్యాల క్రైం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్‌ను శుక్రవారం రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో సీపీ శ్రీనివాస్ ఆవిష్కరించారు. జిల్లా రిటైర్డు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండి తహసోద్దీన్‌ను సీపీ సన్మానించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జలగం నారాయణరావు, జనరల్ సెక్రెటరీ లింగారెడ్డి, జాయింట్ సెక్రెటరీ ఎండి మెరాజోద్దీన్ పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల రాజ్యాధికారంతోనే దేశాభివృద్ధి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టులు రాజ్యాధికారం చేపట్టినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డిలో జరిగే రాష్ట్ర 4వ మహాసభల పోస్టర్‌ను శ్రీరాంపూర్‌లోని పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం మరింత బీదరికంగా మారిందని ఆరోపించారు. నిరుద్యోగం, అత్యాచారాలు, హత్యలు, గంజాయి, దోపిడీ, మోసాలు పెరిగి పోయాయన్నారు. గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. వైద్యం, విద్య వ్యాపారంగా మారిందన్నారు. కమ్యూనిస్టు పార్టీలకు అధికారం ఇస్తే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు బోడెంకి చందు, దుంపల రంజిత్ కుమార్, దూలం శ్రీనివాస్, బొండ్ల సరిత, కాసిపేట రాజేశం, సతీష్ పాల్గొన్నారు.

పారుపెల్లి వరకు రోడ్డు నిర్మించాలి

కోటపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కోటపల్లి నుంచి పారుపెల్లి వరకు మంజూరైన బీటీ రోడ్డు నిర్మించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మించాలనే డిమాండ్‌తో శుక్రవారం నిర్వహించ తలపెట్టిన పాదయాత్రను పోలీసులు భగ్నం చేశారన్నారు. కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితో పాదయాత్ర వద్దంటూ కార్యకర్తలను ముందస్తు అరెస్టు చేశారన్నారు. ప్రస్తుతం పాదయాత్ర విరమించుకున్నా తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. మండలంలో అటవీ అనుమతులు లేవనే సాకుతో పలు రోడ్డు పనులు నిలిచిపోయాయన్నారు. ఈ రహదారి అటవీ శాఖకు సంబంధం లేకున్నా పనులు సాగడం లేదన్నారు. నాలుగు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు పున్నంచంద్, మండల ఇన్‌చార్జీ నాగేశ్వర్‌రావు, జనరల్ సెక్రటరీలు వెంకన్న, లచ్చన్న, కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్యాంసుందర్, సర్వాయిపేట మాజీ సర్పంచు మహేష్, నాయకులు రాకేష్, చంద్రయ్య, బలరాం, సాయి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నస్పూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని నస్పూర్, సంఘమల్లయ్య పల్లె, తీగల్‌పహాడ్, శ్రీరాంపూర్ కాలనీ, ఆర్‌కె-6 గుడిసెల ప్రాంతాలకు శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌కే-6 సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా ఆయా ప్రాంతాలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరు ఏఎస్‌ఐలకు ఎస్‌ఐలుగా పదోన్నతి

కోటపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐలుగా విధులు నిర్వహిస్తున్న కాంతారావు, లక్ష్మణ్‌లకు ఎస్‌ఐలుగా పదోన్నతి లభించింది. దీంతో వీరివురు శుక్రవారం రామగుండం సీపీ శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మరో వైపు ఇరువురికి ఎస్‌ఐలుగా పదోన్నతి లభించడంపై రూరల్ సీఐ సుధాకర్, ఎస్‌ఐ రాజేందర్‌లతోపాటు సిబ్బంది అభినందించారు.

ఓరియంట్ ఎన్నికలపై వీడిన ఉత్కంఠ

● ఈ నెల 28న ఎన్నికల గుర్తుల కేటాయింపు ● వివరాలు వెల్లడించిన డిప్యూటీ లేబర్ కమిషనర్ రాజేశ్వరమ్మ



ఆదిలాబాద్ డీసీఎల్ కార్యాలయం ఎదుట హర్షం వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కాసిపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కార్మిక శాఖ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ ఈశ్వరమ్మ ఎన్నికల ప్రక్రియపై వివరాలను వెల్లడించారు. ఈ నెల 28న ఓటరు జాబితా ప్రదర్శనతోపాటు కార్మిక సంఘాలకు గుర్తుల కేటాయింపు, గేట్ మీటింగ్‌ల తేదీలను ప్రకటించనున్నట్లు తెలిపారు. 2024 ఆగస్టు 24లోపు కంపెనీలో పనిచేస్తున్న 265 మంది ఉద్యోగులు మాత్రమే ఓటు హక్కుకు అర్హులని తెలిపారు. ఓరియంట్ కంపెనీలో పది కార్మిక సంఘాలుండగా ఐదు యూనియన్‌లు పోటీ చేసేందుకు అర్హత సాధించాయన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో ఓరియంట్‌లో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలను ప్రారంభించారు. దీంతో కార్మిక సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఓరియంట్ సిమెంట్ కంపెనీ పర్మినెంటు వర్కర్స్, లోకల్ యూనియన్, కంపెనీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, తెలంగాణ ఓరియంట్ సిమెంట్ కంపెనీ స్టాఫ్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్, ద లోకల్ ఓరియంట్ కంపెనీ ఎంప్లాయిమెంట్ వర్కర్స్‌యూనియన్‌ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సిమెంటు కంపెనీ అధికారులు ఉమాశంకర్‌రావు, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

తప్పుడు అఫిడవిట్ సమర్పిస్తే కఠిన చర్యలు

మంచిర్యాల క్రైం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పోలీసు వెరిఫికేషన్ కోసం తప్పుడు అఫిడవిట్లు సమర్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు పరిశ్రమల్లో పని చేయడానికి పోలీసు వెరిఫికేషన్ సర్టిఫికెట్ (పీవీసీ) కోసం దరఖాస్తులు చేసుకుంటారన్నారు. వారు తమపై ఎలాంటి కేసులు లేవని తప్పుడు అఫిడెవిట్లు సమర్పిస్తున్నారన్నారు. అధికారులు విచారణ చేసినప్పుడు కొందరిపై కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. తప్పుడు అఫిడవిట్లు ఇచ్చిన సుమారు 20 మందిని గుర్తించామని, వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

క్రీడాకారులను అభినందించిన కమాండెంట్

హాజీపూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని శివాజీ మైదానంలో జరిగిన మంచిర్యాల ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌లో గుడిపేట టైటాన్స్ జట్టు విజేతగా నిలువగా జట్టు క్రీడాకారులను శుక్రవారం బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది దుర్గ, జబెర్, సంతోష్, పోచం, నజీమ్, హరి, పండుసాయి, ఫయాజ్, దిలీప్, అశోక్‌లు టోర్నమెంట్‌లో ప్రతిభ కనబర్చి విజేతగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక ధారుడ్యం కలుగుతుందన్నారు. అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాసు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

నెన్నెల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి చెందిందని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. తాము మంజూరు చేసిన నిధులతో పనులు చేస్తూ ఎమ్మెల్యే గడ్డం వినోద్ చేసినట్టు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుంటున్నారన్నారు. స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. 2023లో వివిధ పనుల కోసం రూ.30 కోట్ల డీఎంఎఫ్టీ నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. నెన్నెల మండలంలోని కొత్తగూడెం, బొప్పారం, కోనంపేట రోడ్డు, ఎర్రవాగు బ్రిడ్జీ పనులకు 2023లోనే నిధులు మంజూరయ్యాయన్నారు. అవే పనులు కొనసాగుతున్నాయన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైస్‌మిల్లర్లు రూ.వంద కోట్లు స్వాహా చేసినప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ధాన్యం స్కాంలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వినోద్ స్థానికంగా నివాసం ఉండకపోవడంతో మండ లానికో ఎమ్మెల్యే తయారయ్యాడని ఆరోపించారు. ఎన్నికల హామీలైన ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. పూర్తిగా రుణమాఫీ చేయకుండా, రైతు భరోసా ఇవ్వకుండా ప్రభుత్వం రైతు లను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ బెదిరింపులకు బీఆర్ఎస్ నాయ కులు భయపడరని, ప్రజల పక్షాన నిలబడి పోరాడతామన్నారు. మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేష్, నాయకులు రాంచెందర్, ప్రతాప్‌రెడ్డి, ఎండీ ఇబ్రాహీం, తిరుపతి, కొయ్యడ శ్రీనివాస్ పాల్గొన్నారు.



సదా మీ సేవలో ఆంధ్రజ్యోతి

అ చిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులు గా చేరాలనుకుంటున్నారా!
అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితె చాలు
మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు.

పత్రిక పంపిణిలో మీకు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

మంచిర్యాల : 94929 68431
బెల్లంపల్లి : 77806 58811
కుమ్రంభీం ఆసిఫాబాద్ : 84639 54674
C.O : 99854 11276

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

డయాలిసిస్ కేంద్రంతో..
తీరిన కష్టాలు

- పెరుగుతున్న డయాలిసిస్ పెషెంట్లు
- మరో రెండు మిషన్లు వస్తే మరింత ఉపయోగం
- నివేదికలు పంపించిన అధికారులు

కాగజ్‌నగర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కిడ్నీ చెడిపోయిన నిరుపేదల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన డయాలిసిస్ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపతున్నాయి. జిల్లాలో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నాలుగు గంటలకు ఒకరి చొప్పున ఈ కేంద్రాల్లో డయాలసిస్ చేస్తున్నారు. ఐదు డయాలిస్ మిషన్లతో 20 23న



కాగజ్‌నగర్‌లోని డయాలిసిస్ కేంద్రం

అప్పటి ఆరోగ్యశాఖమంత్రి తన్నీరు హరీష్‌రావు ప్రారంభించారు. ప్రతిరోజు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ కేంద్రాల్లో సిబ్బంది 40 మంది డయాలిసిస్ పేషేంట్లకు సేవలు అందిస్తున్నారు. ఈ సేవలు అందటంపై ఈ ప్రాంత నిరుపేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రోజురోజుకూ కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో ప్రతికేంద్రంలో మరో రెండు డయాలిసిస్ మిషన్లను ఏర్పాటు చేస్తే అదనంగా సేవలు అందించే అవకాశాలున్నాయి. ఈ రెండు కేంద్రాల్లో ఉన్నవాటితోనే సేవలు అందిస్తున్నప్పటికీ అవి రోగులకు సరిపడక పోవడం లేదు. కొందరు ప్రయివేటు ఆసుపత్రిల్లో డయాలిసిస్ చేసుకుంటున్నారు. ప్రైవేటులో ఒక్కసారి డయాలిసిస్ చేసుకుంటే రూ.8 నుంచి రూ.10వేల వరకు ఖర్చు పెట్టాల్సి వస్తోందని బాధితులు పేర్కొం టున్నారు.

● ఖాళీ బెడ్ ఉంటేనే డయాలసిస్..

జిల్లాలో ఖాళీ బెడ్ ఉంటేనే డయాలసిస్ చేసేందుకు అనుమతి ఉంది. మరిన్ని మిషన్లను మంజూరు చేయాలని అధికారులకు నివేదికలను ఉన్నతాధికారులకు పంపించినప్పటికీ ఇంతవరకు ఎలాంటి అనుమతులు రాలేదు. ప్రస్తుతం వస్తున్న రోగులకు మాత్రం ఉమ్మడి జిల్లాలో ఉన్న కేంద్రాల్లో సర్దుబాటు చేస్తున్నారు. జిల్లాలోని రెండు కేంద్రాల్లో ఐదు షిఫ్టుల వారీగా సిబ్బంది కీలకమైన సేవలు అందిస్తున్నారు. డయాలసిస్ చేస్తున్న సమయంలో అత్యవసర పరిస్థితి వస్తే మంచిర్యాల, కరీంనగర్ ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కేంద్రాల్లో చికిత్స పొందాలంటే తప్పకుండా ఆరోగ్య శ్రీకార్డు, ప్రభుత్వ వైద్యాధికారి ధ్రువీకరణ పత్రం ఉండాల్సి ఉంటుంది. ఆయా వివరాలు ఖచ్చితంగా ఉండి బెడ్స్ ఖాళీ ఉంటేనే డయాలసిస్‌కు అనుమతి ఇస్తున్నారు. దరఖాస్తులు చేసుకున్న వారికి బెడ్ ఖాళీ కాగానే సమాచారం అందించి సేవలను అందిస్తున్నారు.


కాగజ్‌నగర్‌లో ప్రభుత్వాసుపత్రిలో డయాలిసిస్ సెంటర్‌లో చికిత్సలు పొందుతున్న కిడ్నీ చెడిపోయిన బాధితులు

ఉన్నతాధికారులకు నివేదిక అందించాం..
- చెన్నకేశవ్‌రావు, సూపరింటెండెంట్

డయాలిసిస్ కేంద్రాల్లో మరో రెండుమిషన్లు ఏర్పాటు చేయాలని నివేదికలు పంపించాం. ప్రస్తుతం ఉన్న వాటితోనే సేవలు అందిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు మూడు షిఫ్టులలక్ష డయాలిసిస్ చేస్తున్నాం.

ఇంటర్వ్యూ....
అటవీ సంరక్షణే ప్రధాన ధ్యేయం..
● గోవింద్‌చంద్ సర్దార్, ఎఫ్ఆర్వో, ఆసిఫాబాద్.



ఆంధ్రజ్యోతి: అడవుల సంరక్షణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.?

ఎఫ్ఆర్వో: ప్రతిరోజు సిబ్బంది అటవీ ప్రాంతంలో వాకింగ్ ట్రాక్ నిర్వహించడంతోపాటు రాత్రిపూట రేంజ్‌పరిధిలో ప్రత్యేక పెట్రో లింగ్ నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రానున్న వేసవిలో అడవుల్లో అగ్గి రాజుకోకుండా ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

ఎఫ్ఆర్వో: ఇప్పటికే రేంజ్ పరిధిలోని గ్రామాల్లో సిబ్బందితో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ప్రజలు ఎవరైనా అటవీ ప్రాంతాల్లోకి వెళ్లేటప్పుడు నిప్పుకు సంబంధించిన వస్తువులను తీసుకెళ్లకూడదు. అగ్గిపెట్టడం చేయకూడదని సూచిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: రేంజ్ పరిధిలో కలప అక్రమ రవాణా అడ్డుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎఫ్ఆర్వో : కలప అక్రమ తరలింపుపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచుతున్నాం. రాత్రిపూట ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు కలప అక్రమ రవాణా ప్రాంతాలను గుర్తించి బేస్ క్యాంపు సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తున్నాం.

-ఆసిఫాబాద్ రూరల్, (ఆంధ్రజ్యోతి)

ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో నడవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రేమలాగార్డెన్ పక్కన నిర్వహించిన జగద్గురు నరేంద్రాచార్య రత్నగిరి మహారాజ్ పాదుకా దర్శన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భక్తితోనే ముక్తి లభిస్తుం దని, ప్రతి ఒక్కరూ భక్తిమార్గంలో పయణించాలన్నారు. ఈ సందర్భంగా జగద్గురు నరేంద్ర ఆచార్యసేవలను కొనియాడారు. అనంతరం ఆసంస్థ ద్వారా నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బుద్ధుడు, అంబేద్కర్ ఆశయ సాధన కోసం పనిచేయాలి

వాంకిడి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): బుద్ధుడు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతీదళితుడు కృషి చేయాలని భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ గడపలే అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రపంచశాంతి కోసం బుద్ధుడు, అంబేద్కర్ ఇద్దరూ అవిశ్రాంత కృషిచేశారన్నారు. అనంతరంక్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అశోక్, వినేష్, విజ్, జైరాం, సునీల్, హంసరాజ్, విలాస్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్

ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలి

వాంకిడి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని ఎంవీఐ మోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇందాని చౌరస్తా వద్ద రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ వాహనదారులు మితిమీరిన వేగంతో నడపకూడదన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల, ఓవర్ టేక్ చేయడంవల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటుబెల్టు ధరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐ రాజమల్లు, చంద్రశేఖర్, కానిస్టేబుల్‌రవి,వాజీద్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ మోహన్

ప్రభుత్వ పథకాల సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

సిర్పూర్(యు), జనవరి 17(ఆంధ్రజ్యోతి):మండలంలోని రాఘపూర్,ధనోర గ్రామలను శుక్రవారం తహసీల్దార్ ఉదయ్ కుమార్ సందర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం నిర్వహిస్తున్న సర్వేను పారదర్శకంగా పకడ్బందీగా చేపట్టాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా జరగాలన్నారు.

విద్యార్థులు క్రీడల్లో ముందుండాలి

సిర్పూర్(టి), జనవరి 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో ముందుండాలని మాజీఎంపీటీసీ సోహెల్ అహ్మద్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరిం చుకుని జిల్లా పరిషత్ పాఠశాలలో ఎమ్మెల్సీ దండె విఠల్ ఆధ్వర్యంలో క్రికెట్‌పోటీలు నిర్వహించారు. మొదటి బహు మతి రూ.20వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ అకీల్, సలీం, నానయ్య పాల్గొన్నారు.

మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

రెబ్బెన, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం మాలిసంక్షేమసంఘం రాష్ట్రఅధ్యక్షుడు లెండుగురే శ్యాంరావు, నూతనకమిటీ సభ్యులను మాలికులస్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లెండుగురే శ్యాంరావు మాట్లాడుతూ తనపై నమ్మకం పెట్టి గెల్పించిన ప్రతి ఒక్కరికీ ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆదె వసంత్‌రావు, జిల్లా అధ్యక్షుడువాసు, ప్రధానకార్యదర్శి గంగారం, మండల అధ్యక్షుడు తిరుపతి, మాలికులస్థులు పాల్గొన్నారు.

బ్యాంకుల వద్ద సెక్యూరిటీ ఏర్పాటు చేసుకోవాలి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాల క్రైం జనవరి 17(ఆంధ్రజ్యోతి): బ్యాంకులు, ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలని రామగుండం సీపీ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం కమిషనరేట్‌లో పెద్దపల్లి, మంచిర్యాల ఉన్న ఏసీపీలు, వివిధ బ్యాంకుల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో 109 బ్యాంకులు, 89ఏటీఎం సెంటర్లు ఉన్నాయని, బ్యాంకులు, ఏటీఎంల వద్ద భద్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డులను నియమించాలని, హై ఫ్రీక్వెన్సీ సీసీ కెమెరాలను ఏర్పాటుతో పాటు అలారం సిస్టం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సెక్యూరిటీ గార్డ్ వ్యక్తిగత సమాచారం, పూర్తి బయోడేటా ఉండాలన్నారు. ఏటీఎంలో డబ్బులు ఫిల్లింగ్ చేసే సమయంలో స్థానిక పోలీస్ అధికారులకు, సిబ్బందికి సమాచారం ఇస్తే ఆ ప్రాంతంలో బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బందిని అప్రమత్తం చేస్తామన్నారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, గోదావరిఖని ఏసీపీ రమేష్, పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, జైపూర్ ఏసీపీ ఆరె వెంకటేశ్వర్లు, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావుతో పాటు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

జైపూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): టేకుమట్ల గ్రామ శివారులోని ఫాంహౌజ్‌లో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఐదుగురు వ్యక్తులను పట్టుకుని రూ.20,040 నగదు, ఐదు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఊసేటి వెంకట్రావు, ఇందుకూరి కృష్ణంరాజు, బొబ్బిలి పరమేష్, ధర్మాజీ లక్ష్మణ్,కుల సంతోష్‌లను అదుపులోకి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్‌ఐ లచ్చన్న, సిబ్బంది పాల్గొన్నారు.

బైండోవర్ ఉల్లంఘనపై కేసు నమోదు

కన్నెపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బైండోవర్ ఉల్లంఘించిన కేసులో ముత్తాపూర్ గ్రామానికి చెందిన సుంకరి తిరుపతిపై కేసు నమోదైంది. సెప్టెంబరులో తిరుపతి రూ. 2 లక్షల పూచీకత్తుతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ కాగా ఇటీవల ముత్తాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో గొడవ పడడంతో కేసు నమోదైంది. దీంతో బైండోవర్ ఉల్లంఘించినందుకు రూ.2 లక్షల పూచీకత్తు వారం రోజుల్లో చెల్లించాలని తహసీల్దార్ ఆదేశించారు.

హత్య కేసులో ఒకరి రిమాండ్

రెబ్బెన, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన పుప్పాల సతీష్‌ను హత్య చేసిన భార్య రజితను శుక్రవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్టు సీఐ బుద్ధిస్వామి తెలిపారు. పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తక్కళ్లపల్లికి చెందిన పుప్పాల సతీష్ భార్యను తరుచూ వేధించేవాడు. గురువారం సాయంత్రం సతీష్ మేనమామ ఇంట్లో మద్యం మత్తులో పడి ఉన్నాడు. భార్య రజిత పురుగుల మందు తాగించింది. బంధువులు చూసి కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు తెలియజేశారు. వారంతా సంఘటన స్థలానికి వచ్చిచూసే సరికి సతీష్ మృతి చెందినట్టు తెలిపారు. సతీష్ తల్లి అమృత ఫిర్యాదు మేరకు సతీష్ భార్య రజితను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్టు తెలిపారు. సమావేశంలో ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

కన్నెపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : వీగాం గ్రామపంచాయతీకి చెందిన జిల్లపల్లి విగ్నేష్‌పై కొందరు కర్రలతో దాడి చేశారు. విగ్నేష్ శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్ళగా ఆయన బంధువులైన జిల్లపల్లినాని, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, బబ్లు, లిటిల్ కర్రలతో కొట్టారని విగ్నేష్ తెలిపాడు. బంధువు అయిన మల్లిడి గ్రామానికి చెందిన జిల్లపల్లి నారాయణకు భూ పంచాయతీలో ఎందుకు సహకరిస్తున్నావంటూ దూషిస్తూ దాడి చేశారని విగ్నేష్ తెలిపాడు. గాయాలపాలైన విగ్నేష్‌ను కుటుంబీకులు బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. విగ్నేష్ భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గంగారాం తెలిపారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి


పోస్టర్లను విడుదల చేస్తున్న డీసీపీ, జిల్లా రవాణా శాఖ అధికారి

హాజీపూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతీ వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని డీసీపీ భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం రోడ్డు భద్రతకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు అతివేగంగా, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. ఆటోల్లో, ఇతర వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. జిల్లా రవాణా శాఖ అధికారి సంతోష్‌కుమార్, వాహన తనిఖీ అధికారులు కిశోర్ రెడ్డి, రంజిత్, సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎంవీఐ కిషోర్ చంద్రారెడ్డి, ఎస్సై ఉదయ్‌కిరణ్‌లు అన్నారు. మేదరిపేటలో వాహనదారులు, డ్రైవర్స్ ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ రోడ్డు భద్రత అందరి బాధ్యతన్నారు. ఏఎస్సై పసర్తి రాజేందర్, పోలీసు సిబ్బంది రవి, రమేష్, ఆర్‌టీవో సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతుల్లో రిజర్వేషన్‌లు కల్పించాలి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్‌లు కల్పించాలని బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ఏవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాల్లో అన్ని కేటగిరీల్లో కలిపి బీసీలు 11 శాతం ఉన్నట్లు తెలిపారు. బీసీ ఉద్యో గులకు ప్రమోషన్‌లలో రిజర్వేషన్‌లు అమలు చేయాలని కోరారు. శ్రీనివాస్, భీమ్‌సేన్, వెంకేష్, రాజయ్య పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

మందమర్రిటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మూడో జోన్‌కు చెందిన జంగపెల్లి పద్మకు టీం పంచముఖి స్వచ్ఛంద సంస్థ సభ్యులు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. పద్మ రుమటైడ్ ఆర్థరైటిస్‌తో బాధపడుతుండగా దాతల సహకారంతో సేకరించిన లక్ష రూపాయలను తహసీల్దార్ సతీష్ చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. ఇప్పటికే వైద్యం కోసం పద్మ కుటుంబం రూ.20 లక్షల వరకు ఖర్చు చేశారన్నారు. కృష్ణకాంతాచార్యులు, శంకర్‌రావు, సమ్మయ్య, రాజు పాల్గొన్నారు.



గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష

రెబ్బెన, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆధ్వర్యంలో ఈనెల 26న గోలేటిలోని శ్రీభీమన్న మైదానంలో నిర్వహించనున్న గణతంత్ర వేడుకల నిర్వహణపై జీఎం కార్యాలయంలో అన్నివిభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులతో చేపట్టే పిరిమడ్, పరేడ్, నృత్యాలు ఆకర్షణీయంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం రాజమల్లు, పీవో ఎంనరేందర్, డీజీఎం సెక్యూరిటీ ఎన్ ఉమాకాంత్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

శ్రీరాంపూర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారించాలని మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎస్‌ఆర్‌పీ3 గనిపై ఆయన మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, రాంగ్‌రూట్‌లో వెళ్లవద్దని, మద్యం తాగి డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. సింగరేణి ఉద్యోగులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం అలవాటుగా మార్చుకోవాలని కోరారు.

ఆదాయ పన్ను రద్దు కోసం కృషి: ఐఎన్‌టీయూసీ

శ్రీరాంపూర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కార్మికులకు ఆదాయ పన్ను రద్దు కోసం కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. ఏరియాలోని ఆర్‌కే న్యూటెక్‌గనిలో శుక్రవారం ఆయనబాయిబాట నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, కార్మికులతో మమేకమై వారిసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరించేందుకు యాజమాన్యానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో కేంద్ర ఉపప్రధానకార్యదర్శులు గరిగె స్వామి, ల్యాగల శ్రీనివాస్, ఐ తిరుపతిరెడ్డి, మైనింగ్‌స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతి రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీని విమర్శించే అర్హత ఐఎన్‌టీయూసీకి లేదు

మందమర్రిటౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీని విమర్శించే అర్హత ఐఎన్‌టీయూసీకి లేదని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి భీమనాథుని సుదర్శన్ అన్నారు. శుక్రవారం ఏరియాలోని కేకే ఓసీపీలో వారు మాట్లాడారు. తమ యూనియన్‌ను విమర్శిస్తే కార్మికులు సహించరని ఐఎన్‌టీయూసీ నాయకులు ఇది గుర్తుంచుకోవాలన్నారు. ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు రాజేశం, ఆంజనేయులు, రమణ,తిరుపతి, కుమార్, రాజేష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ నిధి సుస్థిరతకు సమష్టి కృషి చేయాలి

● కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్‌దత్

మంచిర్యాల/మందమర్రిటౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌దారుల సంక్షేమం దృష్ట్యా పింఛన్ నిధి సుస్థిరతకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ కార్యదర్శి విక్రమ్‌దేవ్‌దత్ అన్నారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శుక్రవారం 183వ కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సీఎంపీఎఫ్‌వో) బోర్డు ఆఫ్ ట్రస్టీల సమావేశం జరిగింది. తొలిసారిగా హైదరాబాద్ సింగరేణి భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో కేంద్రబొగ్గు మంత్రిత్వశాఖ ఉన్నతాధికారులు, కార్మికసంఘాల ప్రతినిధులు, సీఎంపీఎఫ్ అధికారులు, బొగ్గు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. బొగ్గు ఉత్పత్తి ద్వారా దేశ అభివృద్ధికి కృషిచేస్తున్న కార్మికులకు సామాజిక భద్రత కల్పించడం కోసం సీఎంపీఎఫ్ సేవలు అందిస్తున్న విషయంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా బొగ్గు మంత్రిత్వశాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్‌దత్ మాట్లాడుతూ పింఛన్ సేవలను మరింత మెరుగుపరచడంతోపాటు, కార్మికులకు పింఛన్‌భద్రతను మరింతగా కల్పించాలని అన్నారు. పింఛన్ నిధిని ఆర్థికంగా పరిపుష్టి పరచడంతో పాటు అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమావేశంలో కేంద్ర బొగ్గుమంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి రూపిందర్ బ్రార్, సంయుక్తకార్యదర్శి, ఫైనాన్సియల్ సలహాదారు నిరుపమా కొట్రూ, డిప్యూటీ డైరె క్టర్ జనరల్ సంతోష్, సీఎంపీఎఫ్ కమిషనర్ విజయ్ కుమార్ మిశ్రా, యూనియన్ల నుంచి బోర్డు ఆఫ్ ట్రస్టీలు, సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్, ఎస్ఈసీఎల్ సీఎండీ డాక్టర్ ప్రేమ్‌సాగర్ మిశ్రా, కోల్‌ఇండియా డైరెక్టర్(పర్సనల్) డాక్టర్ వినయ్ రంజన్, డైరెక్టర్ (ఫైనాన్స్) ముకేశ్ అగర్వాల్‌తోపాటు వివిధ విభాగాల సింగరేణి డైరెక్టర్లు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సీఎంపీఎఫ్ బోర్డు ట్రస్ట్ సభ్యులు

అవసరాలకు అనుగుణంగా పింఛన్లు సవరించండి

శ్రీరాంపూర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రిటైర్ అయిన ఉద్యోగులకు అందించే పింఛన్లను ప్రస్తుత సమాజ అవసరాలకు అనుగుణంగా సవరించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్ రావు, ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం హైదరాబాద్‌లో బొగ్గు మంత్రిత్వశాఖ కార్యదర్శి, సీఎంపీఎఫ్ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ విక్రమ్‌దేవ్ దత్తాకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ, 1998నుంచి కోల్‌మైన్స్ పెన్షన్‌స్కీం ప్రారంభమైందని, ఉద్యోగి రిటైర్ అయిన రోజు ఎంత పింఛన్ మంజూరైందో ఇప్పటివరకు అంతే అందించడం వలన ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. 2024మార్చి 8న వచ్చిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం అందరికీ కనీస పెన్షన్ వెయ్యి రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూ జాతీయ నాయకులు రామేంద్రకుమార్, రాకేష్‌కుమార్, ఎస్‌డి రామానందన్‌కు సైతం వినతిపత్రం అందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉద్యోగులు విధులకు తప్పనిసరిగా హాజరుకావాలి

శ్రీరాంపూర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు విధులకు తప్పనిసరిగా హాజరు కావాలని ఎస్‌ఆర్‌పీ1,3 గనుల గ్రూప్ ఏజెంట్ వెంకటేశ్వర్లు అన్నారు. 150మస్టర్లకంటే తక్కువ ఉన్న సూపర్‌వైజర్లకు మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సూపర్‌వైజర్ సిబ్బంది తమవద్ద విధులు నిర్వర్తించే కార్మికులకు ఆదర్శంగా నిలవాలని, సక్రమంగా డ్యూటీకి వస్తూ మన్ననలు పొందాలని సూచించారు. పదోన్నతి పొందిన 15మంది ఉద్యోగులకు ఎస్‌ఆర్‌పీ3 గని మేనేజర్ వెంకట్రావ్ పదోన్నతి పత్రాలు అందించారు. ఆయా కార్యక్రమాల్లో సంక్షేమాధికారి సాధన్, పిట్‌కార్యదర్శి మురళీచౌదరి పాల్గొన్నారు.

పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు

రెబ్బెన, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు పారదర్శకంగా జరుగుతుందని ఎస్‌వోటు జీఎం రాజమల్లు తెలిపారు. శుక్రవారం గోలేటిలోని జీఎంకార్యాలయంలో ఉద్యోగుకు క్వార్టర్ల కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో పర్సనల్‌మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సివిల్ ఎస్ఇ మదీనాభాష, తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర గంగాజలాన్ని సేకరించిన మెస్రం వంశీయులు

- 28న నాగోబా జాతర
- గంగాజలంతో మహాదేవుడికి అభిషేకం

జన్నారం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) :ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబాకు గంగా జలంతో అభిషేకం చేసేందుకు శుక్రవారం మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కలమడుగు గోదావరి నదిలో గల అస్తిన మడుగులో మెస్రం వంశీయులు గంగాజలాన్ని సేకరించారు. గంగా జలం కోసం ఈ నెల 10న కేస్లాపూర్ నుంచి 190 మంది మెస్రం వంశీయులు కాలినడకన బయలుదేరారు. బట్టగూడ, వడగం, సాలెవాడ, దర్మగూడ, కొత్తగూడ, ఉడుంపూర్ మీదుగా 7 రోజుల అనంతరం గురువారం రాత్రి కడెం మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చేరుకున్నారు. ఆనవాయితీ ప్రకారం రాత్రి అక్కడ నిద్రించి శుక్రవారం తెల్లవారుజామున జన్నారం మండలంలోని కలమడుగు గోదావరి నదిలోని అస్తినమడుగులో గంగజ లాన్ని సేకరించి పూజలు చేశారు. వెంట తెచ్చుకున్న ఝరిలో గంగా జలా న్ని సేకరించి ప్రత్యేక పూజలు చేశారు. గోటితో వలిచిన ధాన్యాన్ని వండి నైవేద్యాన్ని సమర్పించి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం గంగా జలంను భుజాన పెట్టుకుని ఎక్కడా కింద పెట్టకుండా తిరుగు పయనమ య్యారు. ఉట్నూరు, నర్సాపూర్ మీదుగా బయలుదేరి 24న ఆలయ సమీపం లోని చెట్టుకు గంగాజలాన్ని కడతారు. ఈ నెల 28న జరిగే నాగోబా మహా జాతరలో అస్తినమడుగులో నుంచి సేకరించిన గంగా జలంతో మహా దేవు నికి అభిషేకం చేయనున్నట్లు మెస్రం వంశీయులు కటోడా హన్మంతరావు తెలిపారు. మెస్రం వంశీయులు కోసేరావు, జంగు పటేల్, తిరుపతి, మారుతి, తుకారాం, ఆనందరావు, నాగనాథ్ తదితరులు పాల్గొన్నారు.


గంగా జలానికి పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు


గంగాజలాన్ని సేకరిస్తున్న మెస్రం వంశీయులు


గంగాజలంతో తిరుగు పయనమైన మెస్రం వంశీయులు

మూడేళ్లుగా ఎదురుచూపులు

5వపేజీ తరువాయి

పరీక్షలరుసుం అనుమతిస్తామని నిబంధనలు పెడుతుండటంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. విద్యార్థుల కోర్సులు పూర్తయినా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాకపోవడం తో యాజమాన్యాలు ఒరిజినల్ సర్టిఫికేట్లు ఇవ్వడానికి నిరాకరిస్తు న్నాయి. అటు ప్రభుత్వం నుంచి నిధులు విడుదలకాక, ఇటు కాలేజీ ఫీజులు కట్టలేక బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. ప్రభుత్వాల వైఖరి కార ణంగా ఆయా వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులకు స్వస్తి పలకాల్సిన పరిస్థితులు దాపురించాయి.

మూతపడుతున్న కళాశాలలు....

జిల్లాలో ఒకప్పుడు 14 డిగ్రీ, 14 జూనియర్ కళాశాలలు ఉంటే.. ప్రస్తుతం 5 చొప్పున మిగిలాయి. నిర్వహణ భారమై యేటా కళా శాలలు మూతబడుతు న్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో డేటా సైన్స్, ఫుడ్ సైన్స్, డైరీ సైన్స్, బీటీఏ తదితర కోర్సులు అందుబాటులో లేవు. ప్రైవేటులో మాత్రమే ఉన్నాయి. విద్యార్థులు కళాశాలకు రావాలంటే బస్సులు నడపక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో నిర్వహణ ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. నిర్వహణ భారంతో కళాశాలలు ఎత్తివేస్తుండటంతో విద్యార్థులు ఆ విభాగా ల్లోని విద్యకు దూరమవుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఒక్కొక్కటిగా కళాశాలలు మూసివేతకు గురై విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నాయి.

బీసీ విద్యార్థుల సమర శంఖారావం....

ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యం లో సమర శంఖారావం పూరిస్తున్నారు. ఈ నెల 30న హైద్రా బాద్‌లోని ఇందిరాపార్కు వద్ద బీసీ విద్యార్థుల సమర శంఖారావం పేరుతో ప్రత్యక్ష ఆందో ళన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఫీజుల కోసం బీసీ విద్యార్థిలోకం ధర్నా నిర్వహిస్తుండగా, అనంతరం కూడా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేసే దిశగా కార్యాచరణ చేపట్టే యోచనలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఉన్నారు.

నిధులు విడుదల చేయాలి



ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదల విషయం లో ప్రభుత్వం తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. విడుదల చేయకపోవడంతో విద్యార్థులతో పాటు కళాశాలల యాజమా న్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నాయి. నిర్వహణ భారమై కళాశాలలు మూసివేతకు గురైతే విద్యార్థులు నష్టపోవ డంతోపాటు వాటిలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న వారంతా ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది.

- ఉదారి చంద్రమోహన్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

పార్కులను సద్వినియోగం చేసుకోవాలి


పార్కు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత

బెల్లంపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పార్కులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కులశ్వేత అన్నారు. శుక్రవారం పట్టణంలోని 5వ వార్డులో రూ. 5 లక్షలతో నిర్మిస్తున్న పార్కు పనులను ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలోని పార్కులు, ఓపెన్ జిమ్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు ఆడుకునే వస్తువులతో పార్కులను ఏర్పాటు చేశామన్నారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని ఇంక్లైన్ బస్తీలో రేషన్ కార్డుసర్వేను పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమపథకాలు ప్రతి ఇంటికి చేరుతుంటాయని, విడతల వారీగా అర్హులందరికి అందజేస్తామన్నారు. కౌన్సిలర్ విజయతిరుమల, కమిషనర్ శ్రీనివాస్,నాయకులు జావేద్, వార్డు ఆఫీసర్‌సుష్మ, ఆర్‌పీ రజిత పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మాజీ జెడ్పీటీసీ, ఎంఈవో

మందమర్రిరూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో దేహ దారుఢ్యంతోపాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని కాంగ్రెస్ నాయకులు మంద తిరుమల్‌రెడ్డి పేర్కొన్నారు. సారంగపల్లిలో నిర్వ హిస్తున్న దివంగత గడ్డం వెంకటస్వామి స్మారక క్రికెట్ మ్యాచ్‌ను శుక్రవారం ఆయన టాస్ వేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. టోర్న మెంట్‌కు తన వంతు సహాయ సహకారలు అందిస్తానని తెలిపారు. నిర్వాహకులు కిశోర్, సభ్యులు చంద్రకళ, రాములు, తాజుద్దీన్, యాదగిరి, మల్లేష్, లింగయ్య యాదవ్,కుమారస్వామి పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆస్నాద గ్రామంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. పోటీల్లో 32 జట్లు పాల్గొనగా లంబడిపల్లి జట్టు మొదటి స్థానంలో నిలువగా రూ.10 వేలు, కోటపల్లి జట్టు ద్వితీయ రూ.7 వేలు, మంచిర్యాల జట్టు తృతీయ రూ.4 వేలు, ఆస్నాద జట్టు నాలుగో స్థానంలో నిలువగా రూ.2 వేల నగదు, ట్రోఫీలను అందజేశారు. మాజీ జెడ్పీటీసీ బెల్లకొండ కరుణసాగర్‌రావు, ఎంఈవో రాధాకృష్ణ మూర్తి, ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జగన్‌మోహన్‌రావు, రాజమోహన్‌రావు, పీడీ సత్యనారా యణ, పీఈటీలు అనూష, ప్రీతి, రెఫరీలు ప్రేమ్‌కుమార్, రమేష్‌లు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ

భీమిని, (ఆంధ్రజ్యోతి) : క్రీడలు శారీరక శ్రమతోపాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఎస్సై విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని చిన్నతిమ్మాపూర్ గ్రామానికి చెందిన యువకు లకు ఆయన వాలీబాల్ కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు చదువుతోపాటు క్రీడల్లో పాల్గొంటూ రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఎంపికై గ్రామానికి, మండలానికి పేరు తీసుకు రావాలన్నారు. కానిస్టేబుల్ వినోద్, లక్ష్మణ చారి, సురేష్ యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకటహార చతుర్థి


హోమంలో పాల్గొన్న భక్తులు

నస్పూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ బోర్డు కాలనీ లక్ష్మి గణపతి దేవాలయంలో శుక్రవారం ఆలయ ప్రధానార్చకులు వంశీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో లక్ష్మి గణపతి హోమం, ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేశారు. సంకట హర చతుర్థిని పురస్కరించుకుని సాయంత్రం 108 కిలోల కుంకుమతో మహా కుంకుమాభిషేకం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతి రావు తెలిపారు.

సర్వేలను పకడ్బందీగా నిర్వహించాలి


పొనకల్‌లో సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్, రాంపూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ హరికృష్ణ

జన్నారం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రైతుభరోసా, రేషన్ కార్డుల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. శుక్రవారం పొన కల్ గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీ లించారు. ఆయన మాట్లాడుతూ వివరాలను పూర్తి స్థాయిలో సేకరించాలని సర్వే సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

భీమిని, (ఆంధ్రజ్యోతి): సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో హరికృష్ణ ఆదేశించారు. భీమిని, రాంపూర్ గ్రామాల్లో జరుగుతున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్ల, కొత్త రేషన్‌కార్డుల, ఆత్మీయ భరోసా సర్వే ప్రక్రి యను పరిశీలించారు. సర్వేను పారదర్శకంగా చేపట్టా లన్నారు. తహసీల్దార్ బికర్ణదాస్, ఆర్ఐ వెంకటేష్, కార్యదర్శి సత్యనారాయణ రాజు, ఏఈఓ అఫ్రోజ్ ఉన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో రైతు భరోసా సర్వేను అధికారులు చేప ట్టారు. సాగు భూములను పరిశీలిస్తూ వివరాలను నమోదు చేశారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుం డా చూసేందుకు ప్రాథమిక స్థాయిలో పరిశీలించి సర్వే చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి): చిర్రకుంట గ్రా మంలో రేషన్ కార్డుల సర్వేను ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. రేషన్ కార్డుల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలన్నారు.అర్హులకు పూర్తిస్థాయిలో పథకా లు అందేలా కృషి చేస్తామన్నారు. మండల పం చాయతీ అధికారి సత్యనారాయణ, కార్యదర్శి వీరేం దర్, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, ఇందిర మ్మ కమిటీ సభ్యులు రాంచందర్, కామెర బాలయ్య, సంపత్‌రావు, సుధాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): కిష్టంపేట, చౌటపల్లి గ్రామాల్లో జరుగుతున్న రైతు భరోసా సర్వేను అసి స్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ రాజా నరేంద్ర పరిశీ లించారు. భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధం చేస్తుం దన్నారు. సాగుకు యోగ్యంగా లేని భూములు, లే అవుట్లుగా మారిన, నాలా కన్వర్షన్ భూములను గుర్తించి రైతు భరోసా సాయాన్ని పొందే జాబితాలో నుంచి తొలగిస్తామన్నారు. ఏఈవో శంకర్, పంచాయ తీ కార్యదర్శులు ఉదయ్‌రాంప్రసాద్, వసంత, రెవె న్యూ సిబ్బంది హన్మంతు, కిషన్ ఉన్నారు. రేచినిలో జరుగుతున్న రైతు భరోసా సర్వేను మండల పంచా యతీ అధికారి అనిల్‌కుమార్ పరిశీలించారు. కార్యద ర్శులు శ్రీనివాస్, దివాకర్, రమాదేవి పాల్గొన్నారు.

జైపూర్, (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా, రేషన్ కార్డుల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. రామారావుపేట, ఇందారం గ్రామాల్లో నిర్వహిస్తున్న రైతుభరోసా, రేషన్ కార్డుల సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వేను పకడ్బందీగా నిర్వహిం చి అర్హులైన వారిని గుర్తించాలన్నారు. గ్రామాల్లో పారి శుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలని, రోడ్లపై చెత్తా,చెదారం లేకుండా చూడాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లను వేగవంతం చేసి వసూలైన డబ్బు లను పంచాయతీ సాధారణ నిధికి జమ చేయాల న్నారు. సెగ్రిగేషన్ షెడ్‌లో కం పోస్టు ఎరువును తయారు చేయాలని, నర్సరీలోని మొక్కలకు వినియో గించాలన్నారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, కార్యద ర్శులు రజిత,సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.



దేవాపూర్‌లో పాములు పడుతున్న నీలాల రమేష్

పాములు రైతులకు నేస్తాలు

- రెండు సార్లు పాము కాటుకు గురయ్యా
- మంత్రాలు, మూలికలను నమ్మవద్దు
- పాములు పట్టే నీలాల రమేష్

కాసిపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పాములు రైతు నేస్తాలు. పంట పొలాల్లో పాములు తిరగడం వల్ల ఎలుకల నుంచి పంట లకు రక్షణ ఉంటుంది. పాములన్నీ విషపూరితమైనవి కావని పేర్కొంటున్నాడు నీలాల రమేష్. దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. వచ్చే డబ్బులు సరిపోక పాములు పట్టడం ఉపాధిగా ఎంచుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయన మాటల్లోనే..

పదేండ్ల నుంచి పాములు పడుతున్నా. ఇప్పటి వరకు సుమారు 4 వేలకు పైగా పాములు పట్టుకున్నా. మొదట్లో పాము కనబడితే కట్టెతో కొట్టి చంపేవాన్ని. అవి చనిపోతున్నప్పుడు కలిగిన బాధ నాలో మార్పు తెచ్చింది. వాటిని చంపవద్దని నిర్ణయించుకున్నా. పట్టుకున్న పాములను సమీప అటవీ ప్రాంతాల్లో వదలివేస్తున్నా.

పాములు పట్టే సమయంలో రెండు సార్లు కాటుకు గురయ్యాను. గమనించిన స్థానికులు సకాలంలో ఆసుపత్రికి తీసుకువెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. కుటుంబీకులు, బంధువులు పాములు పట్టడం మానేయమని చెప్పారు. పాము వచ్చిన ఇంటి యజమా నులు నా నంబరు 7287854690కు ఫోన్ చేసేవారు. దీంతో పాములను పట్టుకుని అడవిలో వదిలేస్తున్నా. పాములు ఎవరిని పగబట్టవు. పాము కళ్లు మాత్రం చాలా వేగంగా పనిచేస్తాయి. పాములు ఆడించే వారు పాము కాటేస్తే ఏమి కాదని చెబుతూ గోళీలు, వేరు ముక్కలు అమ్ముతారు. వాటిని నమ్మి మోస పోవద్దు. నాగుపాము, కట్లపాము, పింజర పాము, చెట్ల చెడుగులు మాత్రమే అత్యంత ప్రమాదకరమైనవి. వీటి కాటుకు గురైతే సమీప ఆసుపత్రికి వెళ్లాలి. కానీ సొంత ప్రయోగాలు చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. పాములు ఎక్కువగా పంట పొలాలు, ఇనుప వస్తు వులు నిల్వ ఉన్న చోట పాడుబడిన ఇండ్లలో, చీకటి గదుల్లో నివ సిస్తుంటాయి. పాములకు హానీ తలపెట్టే క్రమంలో మాత్రమే ఆత్మ రక్షణ కోసం కాటు వేస్తాయి.

ఎమ్మార్పీఎస్ కార్యవర్గం



భీమిని, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా బొడ్డు రవీందర్‌ను శుక్రవారం ఎన్నుకు న్నారు. మండల ఇన్‌చార్జి జిలకర శం కర్ అధ్యక్షతన నిర్వహించిన సమావే శంలో రాష్ట్ర అధికార ప్రతినిధి సతీష్, జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జిల్లపల్లి మల్లేష్, అధికార ప్రతినిధిగా వేల్పుల నందకి షోర్, ప్రధాన కార్యదర్శిగా అరికల రమే ష్, ఉపాధ్యక్షుడిగా మీసాల మహేందర్ లను ఎన్నుకున్నారు. మందకృష్ణ మాది గ పిలుపు మేరకు వెయ్యి గొంతుకలు లక్ష డప్పులు కార్యక్రమాన్ని బలోపేతం చేయాలని పిలుపు నిచ్చారు.

ఆర్థిక సహాయం

హాజీపూర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): గుడిపేట 13వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న నాలుగో తరగతి ఉద్యోగి రాజం ఇటీవల అనారోగ్యంతో మృతి చెం దాడు. బెటాలియన్ సిబ్బంది జమ చేసిన రూ.45,900 నగదును శుక్రవారం రాజం భార్య సరోజకు కమాండెంట్ వెంకటరాములు అందజేశారు. బెటా లియన్ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ఛాయ్‌కి భలే గిరాకీ

- ఆసక్తి చూపుతున్న ప్రజలు
- జిల్లాలో వెలుస్తున్న బెల్లం టీ స్టాల్స్



మందమర్రి టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బెల్లం ఛాయ్‌కి భలే గిరాకీ లభిస్తుంది. ప్రస్తుతం ఈ ఛాయ్ ట్రెండ్ కొనసాగుతుంది. ఆయా కంపెనీలకు సంబంధించి ఫ్రాంచైజర్‌ల ద్వారా నిర్వా హకులు స్టాల్‌లను ఏర్పాటు చేస్తున్నారు.మంచి ర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, లక్షెట్టిపేట, చెన్నూరు ప్రాంతా ల్లో ఈ టీ స్టాల్స్ వెలిసాయి. మందమర్రి పట్టణం లోని పదికి పైగా బెల్లం టీ స్టాల్స్ వెలిశా యంటే ప్రజల్లో ఎంత ఆసక్తి ఉందో అర్థం చేసుకోవచ్చు.


చాయ్ సేవిస్తున్న పట్టణవాసులు

రెండు రకాలు

బెల్లం టీ లో రెండు రకాలు ఉన్నాయి. దీనిలో ఆర్డినరీ, స్పెషల్. స్పెషల్ టీ రూ.15 విక్రయిస్తు న్నారు. పిల్లలకు సంబంధించి బెల్లం పాలు కూడా అమ్ము తున్నారు. స్టాల్స్ నిర్వాహకులు ప్లాస్టిక్‌కు బదు లుగా కప్పులు, గ్లాసుల్లో అందజేస్తున్నారు. దీంతో చాలా మంది ఈ టీ తాగడానికి ఇష్టపడుతున్నారు. బెల్లం టీ ద్వారా మాస్టర్స్‌తోపాటు మరో ముగ్గురికి ఉపాధి లభిస్తుంది. వారికి రోజుకు రూ.400 డబ్బులు చెల్లిస్తున్నారు. యువత ఎక్కువగా బెల్లం టీ తాగేం దుకు మొగ్గు చూపుతున్నారు.

బెల్లం టీ నిర్వాహకులు ఫ్రాంచైజర్స్ మహారాష్ట్ర నుం చి సరఫరా చేస్తున్నారు. ఒక ఫ్రాంచైజ్ తీసుకుంటే రూ.2 లక్షలు చెల్లించి దానికి సరిపడా స్టాక్‌ను తీసుకుంటున్నారు. దానికి సంబంధించి బాక్సులు ఫ్రాంచైజర్స్ ఇస్తున్నారు.

గిరాకీ బాగుంది..



-సత్యం, బెల్లం టీ నిర్వాహకుడు

బెల్లం ఛాయ్‌కి మంచి గిరాకీ ఉంటుంది. ఉదయం 6 గంటలకే టీ స్టాల్‌ను ప్రారంభిస్తా. సాయంకాలం 7 గంటల వరకు మూసివేస్తాను. బెల్లం ఛాయ్‌కు సంబంధించి ముడిసరుకులు కొనుగోలు చేస్తున్నా.

యువతలో ఆసక్తి



-ఆకాష్ టీ స్టాల్ నిర్వాహకుడు


బెల్లం టీని యువకులు ఇష్టపడుతున్నారు. ఉపాధి కోసం వెతుకుతుండగా టీ స్టాల్ ఆలోచన వచ్చింది. వెంటనే టీ స్టాల్ ఏర్పాటు చేశాను. నా కుటుంబంను పోషించుకునే విధంగా ఆదాయం లభిస్తుంది.

అల్లం టీ కూడా విక్రయిస్తున్నా...



- పాద్యవర్సా నిర్వాహకుడు లోకేష్

ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు గిరాకీ ఉంటుంది. బెల్లం టీతో పాటు అల్లం టీ కూడా అమ్ముతున్నాను. అధిక మంది టీ ప్రియులు బెల్లం టీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఫ్రాంచైస్ ద్వారా టీ స్టాల్ ఏర్పాటు చేశాను.



దరఖాస్తుల ఆహ్వానం

తిర్యాణి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీ విద్యాలయంలో ఖాళీగాఉన్న సీఆర్టీ సాంఘికశాస్త్రం పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో స్వప్న తెలిపారు. సీఆర్టీ కామర్స్, సివిక్స్, నర్సింగ్ పోస్టులకు గెస్టు ఫ్యాకల్టీగా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అర్హులైనవారు ఈ నెల20లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

వాంకిడి, జనవరి17(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని డీవైఎఫ్ఐ జిల్లాకార్యదర్శి కార్తీక్‌అన్నారు. శుక్రవారం మండలంలోని కిరిడిగ్రామంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నిఖిల్,తిరుపతి,వీణ, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు)లో 13.1డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత

ఆసిఫాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సిర్పూర్(యు) మండలంలో శుక్రవారం 13.1డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదయింది. తిర్యాణి మండలం గిన్నెధరిలో 13.3డిగ్రీలు, కెరమెరిలో 14.3డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

దుర్గానగర్‌ను సందర్శించిన ఎంపీడీవో

కాగజ్‌నగర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుర్గానగర్‌ను శుక్రవారం ఎంపీడీవో రమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా దుర్గానగర్‌లో రైతుభరోసా కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరించారు. అలాగే వారి వ్యక్తిగత వివరాలను పరిశీలించారు. ఆయన వెంట ఏపీఎం బుచ్చన్న, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీ గ్రేడ్-2 అయ్యేనా?



- నిరీక్షిస్తున్న కాగజ్‌నగర్ ప్రజలు
- పట్టణ జనాభా 57,803
- మున్సిపాలిటీ ఆదాయం రూ.3కోట్లు
- గ్రేడ్-2గా మారితే మరిన్ని నిధులు వచ్చే అవకాశం
- సమీప గ్రామాలు విలీనం చేస్తే మరింత అభివృద్ధి

కాగజ్‌నగర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాలిటీ గ్రేడ్-2కావాలని ప్రజలంతా నిరీక్షిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంచిర్యాల మున్సిపాల్టీని కార్పొరేషన్‌గా మార్పుచేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కాగజ్‌నగర్ మున్సిపాలిటీ గ్రేడ్-3గా కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాల్టీల అప్‌గ్రేడ్ చేస్తున్న నేపథ్యంలో కాగజ్‌నగర్ మున్సిపాల్టీ గ్రేడ్-2గా మారాలన్న ఆశలు పెరుగుతున్నాయి. కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో 30 వార్డులుండగా, పట్టణ జనాభా 2011లెక్కల ప్రకారం 57,803 ఉంది.

మున్సిపాల్టీకి వచ్చే ఆదాయంలో ప్రధానంగా ఇంటి పన్ను, ఆస్తిపన్ను, ప్రభుత్వ కార్యాయాల పన్నులు, మార్కెట్ వ్యాపారులకు ట్రేడింగ్ లైసెన్సు, నీటి కుళాయిల బిల్లు, ఎల్‌ఆర్‌ఎస్ బిల్లులు కలుపుకుంటే సాలీనా రూ.3కోట్లు ఆదాయం వస్తోంది. కాగజ్‌నగర్ మున్సిపాల్టీ గ్రేడ్-3 పరిధిలో ఉంది. గ్రేడ్-2 చేసేందుకు అవకాశాలున్నప్పటికీ కూడా ఇంకా ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రావటం లేదు. ఐదేళ్ల క్రితం కూడా ఈ మున్సిపాల్టీని గ్రేడ్-2గా మార్చాలని పాలకవర్గం తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపించారు. అయితే ఇది కేవలం ప్రతిపాదనలకే పరిమితమైంది. ఇంత వరకు అమలు కాలేదు.

గ్రేడ్-2గా మారిస్తే మారనున్న మున్సిపాలిటీ రూపురేఖలు..

కాగజ్‌నగర్ మున్సిపాల్టీని గ్రేడ్-2గా మారిస్తే పట్టణ రూపురేఖలు మారుతాయి. సమీప గ్రామాలైన భట్టుపల్లి, అందవెల్లి, జీడీచేను, డాడానగర్, రాంనగర్, కోసిని, బారెగూడ, వంజీరి గ్రామాలు కూడా మున్సిపాల్టీలో విలీనం చేసేందుకు అవకాశాలుంటాయి. దీంతో మున్సిపాల్టీకి ఆదాయం పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా ప్రత్యేకగ్రాంటు విడులయ్యే అవకాశం ఉంటుంది. ప్రధానంగా మున్సిపాల్టీలో అదనంగా వివిధ విభాగాల్లో ఉద్యోగాలు పెరుగుతారు.

ప్రస్తుతం కేంద్రప్రభుత్వం స్వచ్ఛ మున్సిపాల్టీకింద వివిధ నిధులను విడుదలు చేస్తుండగా గ్రేడ్-2గా మారితే కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా అధిక నిధులు వచ్చే అవకాశాలున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ప్రధానంగా మాస్టర్‌ప్లాన్ చేసే అవకాశంతోపాటు సమీపగ్రామాల అనుసంధానం చేస్తే కొత్త కళ రానుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో భైంసా, మందమర్రి, కాగజ్‌నగర్ మున్సిపాల్టీలు గ్రేడ్-3 జాబితాలో ఉన్నాయి. కాగా కాగజ్‌నగర్ పట్టణానికి సరిపడా వనరులున్నాయని, వెంటనే గ్రేడ్-2 మున్సిపాలిటీగా చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మున్సిపాల్టీలోనే అతి పెద్ద పేపర్‌మిల్లు ఉండటం విశేషం. వీటితో కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ మీదుగా దాదాపు అన్ని ఎక్స్‌ప్రెస్‌రైళ్లకు హాల్టు ఉండటం, కాగజ్‌నగర్ మీదుగా మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ కలిసి అంతరాష్ట్ర రహదారి రోడ్డు సౌకర్యం ఉంది. ఆర్థిక వనరులు, రహదారి వ్యవస్థకు అన్ని హంగులున్నాయని అధికారులు వెంటనే గ్రేడ్-2 మున్సిపాలిటీగా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులకు ప్రతిపాదనలు పంపించాం..

అంజయ్య కమిషనర్, కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపాల్టీ ప్రస్తుతం గ్రేడ్-2 విభాగంలో జాబితాలో ఉంది. గతంలో పాలకవర్గం గ్రేడ్-2గా చేయాలని ఉన్నతాధికారులకు నివేదికలను పంపించారు. ఇందుకు అవసరమైన అంశాలను అన్నింటిని ప్రస్తావిస్తూ వివరంగా ఉన్నతాధికారులు నివేదికలను అందజేశారు.

నేటి నుంచి బర్డ్‌వాక్ ఫెస్టివల్-3

బెజ్జూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా అడవులు అటవీసంపద, జీవవైవిధ్యంతోపాటు వివిధ రకాలపక్షులు,వన్యప్రాణులకు పెట్టిందిపేరు. జిల్లాలో అటవీశాఖ అధికారులు వివిధరకాల పక్షిజాతులను గుర్తించేందుకు బర్డ్‌వాక్‌ఫెస్టివల్-3ని ఈనెల18,19 తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బాహ్య ప్రపంచానికి తెలియని ఎన్నోరకాల పక్షిజాతులను కనుగొనేందుకు జిల్లాకు 20మంది ఔత్సాహికులు, శాస్త్రవేత్తలు, ఫొటో,వీడియోగ్రాఫర్లు రానున్నట్లు అటవీఅధికారులు పేర్కొంటున్నారు. వీరంతా జిల్లాలోని పెంచికలపేట,సిర్పూర్(టి),కాగజ్‌నగర్ మండలాల్లోని అటవీప్రాంతాలను సందర్శిస్తారు. అటవీ ప్రాంతంలో ఉన్నపక్షిజాతులపై అధ్యయనం చేస్తారు.



బైకిడేగ

అరుదైన పక్షులకు ఆలవాలం..

ఈసారి నిర్వహించే బర్డ్‌వాక్‌లో మరిన్ని పక్షిజాతులు కనుగొనేందుకు అటవీశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈప్రాంతంలో అరుదైన పక్షిజాతుల్లో పెర్యూగ్రైన్ పాల్కన్, బ్రౌన్ శ్రైరో, బ్రౌన్ రాక్‌చాట్, బ్ల్యూత్రాట్, బ్లాక్ బెల్లిడ్‌టర్న్, రుడ్డీ షెల్డ్‌డర్, సౌతర్న్ గ్రేశ్రైర్, అలెగ్జాండర్ ప్యారా కెప్ట్ వంటి పక్షిజాతులు ఇక్కడ ఉన్నాయనిగుర్తించారు. అంతేకాకుండా శీతాకాలంలో విదేశాల నుంచి వచ్చే వలసపక్షులు కూడా ఇక్కడ ఆవాసంగా ఉన్నాయి. ఇవిఎక్కువగా అన్ని ప్రాంతాల్లో కనిపించవని అధికారులు పేర్కొంటున్నారు. ఇతర రాష్ట్రాల్లో అరుదుగా ఉండే పక్షిజాతులకు ఈ ప్రాంతం నిలయంగా ఉందని చెప్పవచ్చు. పక్షులను చూడాలనుకునే వారికి ఇది మంచి అవకాశంగా ఉంటుందని అధికారులు బావిస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం..

- సుశాంత్ సుఖదేవ్, ఎఫ్‌డీవో, కాగజ్‌నగర్

ఈనెల18,19తేదీల్లో బర్డ్‌వాక్ ఫెస్టివల్ నిర్వహించేందుకు జిల్లాలోని పలుప్రాంతాలను ఎంపిక చేశాం. ఔత్సాహికులు, శాస్త్రవేత్తలు, పక్షిప్రేమికులు 20మంది రానున్నారు. ఇక్కడికివచ్చే ఔత్సాహికులకు అన్ని ఏర్పాట్లుచేశాం. బర్డ్‌వాక్‌తో అటవీ ప్రాంతంలోని జీవవైవిధ్యంతోపాటు పక్షిజాతులు, వివిధరకాల వన్యప్రాణులు,అటవీఅందాలను తిల కించిప్రపంచానికి చాటిచెపేప్పందుకు ఉపయోగపడుతుంది.

రెమ్యూనరేషన్ చెల్లించాలి: టీఎస్‌యూటీఎఫ్

ఆసిఫాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్రకుటుంబసర్వే రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు శుక్రవారం కలెక్టరేట్ ఏవో మధుకర్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వేలో పాల్గొని నవంబర్ చివరిలో రిపోర్టును అందజేశామన్నారు. కానీ ఇంత వరకు ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ చెల్లించకుండా జాప్యం చేయడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు శాంతికుమారి, ఇందురావు, రమేష్, హేమంత్, సుభాష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

- జడ్పీ మాజీచైర్మన్ కోనేరు కృష్ణారావు

బెజ్జూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో యువత క్రీడల్లో రాణించాలని జడ్పీ మాజీచైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని తలాయి గ్రామంలో కోనేరు యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ క్రీడల ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ యువత క్రీడల్లో రాష్ట్రస్థాయిలో రాణించి సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బషరత్‌ఖాన్, సకారాం, శ్రీనివాస్, ఇస్తారి, వెంకన్న, సతీష్, లక్ష్మీనారాయణ, అమృత తదితరులు పాల్గొన్నారు.

'వేల గొంతుకలు.. లక్ష డప్పులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

తిర్యాణి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే 'వేల గొంతుకలు.. లక్ష డప్పులు' కార్యక్రమాన్ని మండలంలోని మాదిగలందరూ హాజరై విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సతీష్, జిల్లాఅధ్యక్షుడు కేశవరావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలం కేంద్రంలో డప్పులతో భారీర్యాలీ నిర్వహించారు. అనంతరం కుమరంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, ఎల్లయ్య, వెంకటేశం, రాయలింగు, బాబు, లింగేష్, అంజయ్య,ఆశాలు,తదితరులు పాల్గొన్నారు.



కుమరం భీం విగ్రహానికి పూల మాల వేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నేడు విద్యుత్ అదాలత్

బెజ్జూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో నేడు విద్యుత్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏఈ అంజల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బెజ్జూరు, పెంచి కలపేట మండలాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారానికి దరఖాస్తు అందజేస్తే సత్వరమే పరిష్కరిస్తామన్నారు.

జర్నలిస్టుల ఇండ్ల నిర్మాణానికి నిధులు, స్థలాలు ఇవ్వాలి

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లోని జర్నలిస్టులకు ఇండ్ల నిర్మాణానికి నిధులు, స్థలాలు ఇవ్వాలని కోరుతూ కాగజ్‌నగర్ ప్రెస్‌క్లబ్ సభ్యులు శుక్రవారం సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులు కేవలం పారితోషికంతో పనిచేస్తున్నారన్నారు. అదేవిధంగాకాగజ్‌నగర్ రెవెన్యూ డివిజన్‌లో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం కాగజ్‌నగర్ తహసీల్దార్ కిరణ్‌కు కూడా వినతిపత్రం అందించి సమస్యలను వివరిం చారు. సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా మాట్లాడుతూ ప్రభుత్వానికి నివే దించి జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇప్పించేందుకు కృషిచేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సురేందర్ రావు, ప్రధానకార్యదర్శి వీటీ చారి, గౌరవ సలహాదారులు పాల్గొన్నారు.

కమిటీ నియామకం

కౌటాల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండల మాదిగ సంఘాల మహాకూటమి కమిటీని రాష్ట్రసలహాదారు భాస్కర్ మాదిగ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బాపు, అధ్యక్షుడిగా తిరుపతి, ఉపాధ్యక్షులుగా మహేష్, రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా తిరుపతి, కోశాధికారిగా స్వామి, ప్రచార కార్యదర్శిగా తిరుపతిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీమాన్, సుధాకర్, నరేష్, పురుషోత్తం, రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వర గుహలో పూజలు

పెంచికలపేట, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధేశ్వరస్వామి గుహలలో ఎల్లూరు గ్రామానికిచెందిన భక్తులు శుక్రవారం పూజలు నిర్వహించారు. గుండాలలో స్నానాలు ఆచరించారు. మొక్కులు తీర్చుకున్నారు. గొంతెమ్మ, బీరమదేవర, లక్ష్మిదేవర, పోతరాజుల విన్యాసాలతో అలరించారు. కార్యక్రమంలో పూజారిరాజం, గ్రామపెద్ద హనుమంతు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే

సిర్పూర్(టి), జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో రేషన్‌కార్డు, రైతుభరోసా, ఆత్మీయ భరోసా సర్వేను శుక్రవారం రెండోరోజు కొనసాగించారు. కార్యక్రమంలో ఏవో గిరీష్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మరమ్మతు పనులు చేపట్టిన అధికారులు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

సిర్పూర్(టి), జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్‌పాఠశాలలో నెలకొన్న సమస్యలపై 'సమస్యలకు నిలయంగా ప్రభుత్వ పాఠశాల' అని ఈనెల 13న 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగిం చారు.

వాటర్‌ట్యాంక్‌ను, మరుగుదొడ్లు, కుళాయిలు వినియోగంలోకి తెచ్చేలా కృషి చేస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు సదాశివుడు తెలిపారు. ప్రతి సంవత్సరం పాఠశాల మెయింటెనెన్స్‌కు వచ్చే నిధుల నుంచి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.



ఎక్స్‌కావేటర్‌తో పిచ్చి మొక్కలను తొలగింపజేస్తున్న అధికారులు

చలో ఉట్నూరును విజయవంతం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆదివాసీ నాయకుల

బెజ్జూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20న తలపెట్టిన చలో ఉట్నూర్‌ను విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల సర్‌మేడి కొడపశంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఆయన మాట్లాడుతూ జీవోనం.3 గిరిజన సంక్షేమశాఖలో 29 విభాగాల్లో వందశాతం ఆదివాసీలకు రిజర్వేష న్‌కు సంబంధించిన ఒకేచట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 1/70చట్టంను, అటవీహక్కు చట్టం, ఏజెన్సీప్రాంతాల చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని, తదితర సమస్యల సాధనకే చలో ఉట్నూర్ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సకారాం, తిరుపతి, బానయ్య, ధర్మయ్య, తులసీరాం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

రెబ్బెన, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమానికి తమవంతు కృషిచేస్తామని రెబ్బెన మాజీ జడ్పీటీసీ సభ్యుడు ప్రకాష్‌రావు, డి సోమయ్య తెలిపారు. గోలేటిటౌన్ షిప్‌లో శుక్రవారం ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ కొంతమందికి జర్నలిస్టులకు ఇండ్లు, ఇళ్లస్థలాలు కూడా ప్రభుత్వం ఇచ్చిందన్నారు. జిల్లాకేంద్రంలో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, మంత్రిసీతక్కతో మాట్లాడతామన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వినయ్, గౌరవ అధ్యక్షుడు ఎస్ సంపత్ కుమార్, కోశాధికారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై లక్ష్మణ్‌ను సన్మానించిన సిబ్బంది

రెబ్బెన, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రెబ్బెన పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఎస్సైగా పదోన్నతి పొందిన లక్ష్మణ్‌ను శుక్రవారం సీఐ బుద్దిస్వామి ఆధ్వర్యంలో ఎస్సై చంద్రశేఖర్ ఘనంగా సన్మానించారు. సీఐ మాట్లాడుతూ సమాజంలో పోలీసుల బాధ్యత ఎంతో ఉందన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు.

తప్పిన ప్రమాదం

దహెగాం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్, మొట్లగూడగ్రామాల మధ్య శుక్రవారం పత్తి తీసుకురావడానికి వెళ్తున్న వ్యాన్‌కు మూలమలుపు వద్ద ద్విచక్రవాహనం ఎదురుగా వచ్చింది. గమనించిన వ్యాన్‌డ్రైవర్ ఒక్కసారిగా వ్యాన్‌ను పక్కకుతిప్పాడు. దీంతో ప్రమాదం తప్పింది. వ్యాన్‌దారి కిందికివెళ్లి ఒకపక్కగా ఒరిగింది.

కలెక్టరేట్ ఎదుట టీఏజీఎస్ ధర్నా

- రుణమాఫీ చేయాలని డిమాండ్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న టీఏజీఎస్ నాయకులు

ఆసిఫాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 31లోగా రుణమాఫీ చేయకపోతే తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని టీఏజీఎస్(తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్ పేర్కొన్నారు. రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుటవారు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రుణమాఫీ ఆదివాసీజిల్లాలో సక్రమంగా అమలుకాలేదని ఆరోపించారు. అనంతరం పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్వోకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మాలశ్రీ, శ్రీనివాస్, గణపతి, దినకర్, సాయికృష్ణ, శ్రావణి, పురుషోత్తం, రాజన్న, హనుమంతు, ఆనంద్‌కుమార్, అనిత తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు గోలేటి క్రీడాకారులు



సాయిచరణ్ ప్రేంకుమార్ ప్రజ్వల

రెబ్బెన, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి 69వ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు గోలేటికి చెందిన షార్ప్‌స్టార్ బాల్ బాడ్మింటన్ క్రీడాకారులు ఎంపికైనట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్‌బాడ్మింటన్ ప్రధానకార్యదర్శి ఆర్ నారాయణరెడ్డి తెలిపారు. బాలుర విభాగంలో పిరిసింగుల సాయిచరణ్, దామెర ప్రేంకుమార్, బాలికవిభాగంలో ప్రజ్వల ఎంపికయ్యారన్నారు. ఈ పోటీలు మహారాష్ట్ర నాగ్‌పూర్‌జిల్లాలో జరుగుతాయన్నారు. ఈనెల21వరకు పోటీలు కొనసాగుతాయన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాల్‌బాడ్మింటన్ అధ్యక్షుడు నర్సింగం, రాష్ట్ర బాల్ బాడ్మింటన్ సంయుక్తకార్యదర్శి ఎస్ తిరుపతి, గోలేటి షార్ప్‌స్టార్ బాల్‌బాడ్మింటన్ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి ఆర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు అభినందించారు.

కొలాంగూడలో స్వచ్ఛత పక్వాడా



గ్రామపంచాయతీ ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న నాబార్డు సభ్యులు

ఆసిఫాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): నాబార్డు ఆధ్వర్యంలో మండలంలోని కొలాంగూడ గ్రామంలో స్వచ్ఛతపక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాబార్డు డీడీఎం వీరభద్రుడు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అలా చేయడం ద్వారా గ్రామం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. జిల్లా, రాష్ట్రం, దేశం శుభ్రంగా ఉంటుందన్నారు. పరిశుభ్రతతో పాటు వ్యక్తిగతపరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. అనంతరం గ్రామస్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రామపటేల్, జనార్దన్, తిరుపతి, భీందాస్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఏఐవైఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిరంజీవి, మహేష్, మల్లికార్జున్, భాస్కర్, సాయికుమార్, రాకేష్, హస్విక తదితరులు పాల్గొన్నారు.

20నుంచి అఖండ హరినామ సప్తాహం



సప్తాహం పోస్టర్లు విడుదల చేస్తున్న సేవాశ్రమ్ సభ్యులు

సిర్పూర్(యు), జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహగాంలో ఈనెల 20నుంచి 27వరకు అఖండ హరినామ సప్తాహం నిర్వహిస్తున్నట్లు శ్రీగురుదేవ్ సేవాశ్రమ్ మహగాం పీఠాధిపతి కైలాస్ మహరాజ్ తెలిపారు. శుక్రవారం మహగాంలో అఖండ హరినామ సప్తాహం పోస్టర్లు విడుదల చేశారు. సంత్ సురోజీ మహరాజ్ శిష్యులు, గ్రామస్థులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చు భక్తులు ఆధ్వర్యంలో కీర్తనలు, ప్రవచనాలు, భజనాలు, అన్నదాన కార్యక్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా ఎంపీ గోడం నగేష్,ఎమ్మెల్యేలు కోవ లక్ష్మీ, ఎమ్మెల్సీ దండే విఠల్ తదితరలు హాజరవుతారన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా శ్రీ గురుదేవ్ సేవాశ్రమ్,సురోజీబాబా యూత్, గ్రామస్థుల అధ్వర్యంలో ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ప్రిన్సిపాల్

కాగజ్‌నగర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో నవోదయ ప్రవేశపరీక్ష నిర్వహించే పరీక్షకేంద్రాలను శనివారం నవోదయ ప్రిన్సిపాల్ పార్వతి పరిశీలించారు. పరీక్ష కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఉదయం 9గంటల నుంచి పరీక్షకేంద్రాలకు పరీక్ష రాసే విద్యార్థులను అనుమతించాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైన సంబంధిత వెంటనే తెలియజేయాలన్నారు. ఉదయం 11.30నుంచి మధ్యాహ్నం 1.30గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు.